VOICE OF PRAJALU
వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..



# ధాన్యం లెక్కల్లో గోల్‌మాల్

**- 24.18 కోట్ల ప్రభుత్వ ధాన్యం దుర్వినియోగం**

**- ప్రభుత్వానికి బియ్యం అందించకుండా ధాన్యం దారి మళ్లింపు**

**- లక్ష్మీ ఇండస్ట్రీస్ పై కేసు - ఇద్దరి అరెస్ట్**

**- డిసిపి భూక్యరామ్ రెడ్డి**

సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా ఆగస్టు-17 వాయిస్ టుడే: ప్రభుత్వ ధాన్యాన్ని కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకుని, అందుకు అనుగుణంగా ప్రభుత్వానికి బియ్యం అందించకుండా ధాన్యాన్ని దారి మళ్లించిన కేసులో ఇద్దరు నిందితులను సుల్తానాబాద్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. ఉదయం పది గంటలకు నిందితులను అరెస్ట్ చేసినట్లు రామగుండం కమిషనరేట్, పెద్దపల్లి డీసీపీ వెల్లడించారు. తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ పెద్దపల్లి జిల్లా మేనేజర్ ముప్పిడి శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రెండు వేల ఇరవై మూడు రెండు వేల ఇరవై నాలుగు ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మీ ఇండస్ట్రీస్‌కు కస్టమ్ మిల్లింగ్ కోసం ప్రభుత్వ ధాన్యాన్ని అప్పగించారు.మొత్తం 10,015.636 మెట్రిక్ టన్నుల ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లర్‌కు అప్పగించగా, దానికి అనుగుణంగా ప్రభుత్వానికి 6,662.880 మెట్రిక్ టన్నుల కస్టమ్ మిల్లింగ్ బియ్యం అందించాల్సి ఉంది. అయితే మిల్లర్ ఇప్పటివరకు 1,577.289 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే అందించారు. మరో 64.872 మెట్రిక్ టన్నుల బియ్యానికి సంబంధించిన మొత్తాన్ని నగదు రూపంలో స్వీకరించారు.దీంతో 5,020.719 మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి ఉండగా, దానికి సమానమైన 7,493.610 మెట్రిక్ టన్నుల ధాన్యం డిఫాల్ట్ అయినట్లు అధికారులు తెలిపారు.ఈ డిఫాల్ట్ ధాన్యం విలువను అధికారులు రూ.24,18,59,070గా, అంటే సుమారు రూ.24.18 కోట్లుగా నిర్ధారించారు.

**భౌతిక తనిఖీలో వెలుగులోకి**

ఈ నెల ఆరవ తేదీన పౌర సరఫరాల శాఖ అధికారులు సుగ్లాంపల్లి గ్రామంలోని లక్ష్మీ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును భౌతికంగా తనిఖీ చేశారు. తనిఖీ సమయంలో మిల్లర్‌కు అప్పగించిన ప్రభుత్వ ధాన్యానికి సంబంధించిన నిల్వ మిల్లు ప్రాంగణంలో భౌతికంగా అందుబాటులో లేదని గుర్తించారు.అప్పగించిన ప్రభుత్వ ధాన్యం నిల్వలను మిల్లర్ సక్రమంగా లెక్కల్లో నమోదు చేయకపోవడంతో, ప్రభుత్వ ధాన్యాన్ని దారి మళ్లించి దుర్వినియోగం చేసినట్లు ప్రాథమికంగా నిర్ధారించినట్లు అధికారులు తెలిపారు.

**అరెస్టయిన నిందితులు**

మొదటి నిందితుడు రేణికుంట మధు, రేణికుంట రవీందర్ కుమారుడు. వల్లంపట్ల గ్రామం, ఇల్లంతకుంట మండలం, సిరిసిల్ల జిల్లా. లక్ష్మీ ఇండస్ట్రీస్ నిర్వహణ భాగస్వామిగా ఉన్నారు. రెండో నిందితుడులి రేణికుంట రవీందర్ రెడ్డి: రేణికుంట నర్సింహ కుమారుడు వల్లంపట్ల గ్రామం, ఇల్లంతకుంట మండలం, సిరిసిల్ల జిల్లా. లక్ష్మీ ఇండస్ట్రీస్ భాగస్వామిగా ఉన్నారు.

**కేసు నమోదు దర్యాప్తు కొనసాగింపు**

నిందితులపై భారతీయ న్యాయ సంహిత రెండు వేల ఇరవై మూడు లోని 316(2), 316(5), 318(3) సెక్షన్ల తో పాటు 3(5) సెక్షన్, నిత్యావసర వస్తువుల చట్టం పంతొమ్మిది వందల యాభై ఐదు లోని ఏడవ సెక్షన్, తెలంగాణ బియ్యం కస్టమ్ మిల్లింగ్ ఉత్తర్వులు రెండు వేల పదిహేను లోని ఏడవ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు.కేసుపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో ఎసిపి గజ్జి కృష్ణ, సిఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్ పోలీస్ సిబ్బంది ఉన్నారు..

## విద్యార్థులకు నాణ్యమైన విద్యే లక్ష్యం నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలి!

**- కెరీర్ గైడెన్స్, ఉన్నత విద్యపై అవగాహన కల్పించాలి**

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష**



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఆగస్టు-17 వాయిస్ టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు.సుల్తానాబాద్ మండలంలోని ఎం.జె.పి.టి.బి.సి.డబ్ల్యూ. ఆర్.ఐ.ఈ.ఎస్ బాలికల డిగ్రీ కళాశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కళాశాలలోని చాంబర్ ఆఫ్ డ్రీమ్స్ ను ప్రారంభించి,డార్మిటరీ, వంటగది,తరగతి గదులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి వారి విద్యాభ్యాసం, భవిష్యత్ లక్ష్యాలు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థులు నాణ్యమైన విద్యతో పాటు భవిష్యత్ ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

**విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ అందించాలి**

విద్యార్థులకు వారి ఆసక్తులు, సామర్థ్యాలకు అనుగుణంగా కెరీర్ గైడెన్స్ అందించాలని సూచించారు. ఉన్నత విద్య, వివిధ కోర్సులు, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. పీజీ కోర్సులకు సంబంధించిన అవకాశాలపై కూడా విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.జిల్లా కలెక్టరేట్ ద్వారా టాస్క్ సహకారంతో విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం, శిక్షణ అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. టాస్క్ రీజినల్ సెంటర్, వీ హబ్ ద్వారా అందిస్తున్న వివిధ కోర్సులు, శిక్షణా కార్యక్రమాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

**అకాడమిక్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌పై దృష్టి**

విద్యార్థులు అకడమిక్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధి అవకాశాలను పొందేందుకు నైపుణ్యాలు ఎంతో కీలకమని తెలిపారు. విద్యార్థులు తమ విద్యతో పాటు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దోహదపడే నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు.కళాశాలలో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు, విద్యా సదుపాయాలను మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డీసీఓ మణిదీప్తి, కళాశాల ప్రిన్సిపాల్ వనజతో పాటు సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

## మంత్రుల పర్యటనపై పోలీసుల ప్రత్యేక దృష్టి!

**- బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ భూక్య రాంరెడ్డి**



సుల్తానాబాద్, పెద్దపల్లి జిల్లా ఆగస్టు-17 వాయిస్ టుడే: సుల్తానాబాద్‌లో ఈ నెల పంతొమ్మిదవ తేదీన మంత్రుల పర్యటన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక భద్రతా చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సుల్తానాబాద్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో చేపట్టాల్సిన బందోబస్తు ఏర్పాట్లను పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి సోమవారం పరిశీలించారు. పర్యటనకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని డీసీపీ అధికారులను ఆదేశించారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే సిబ్బంది ముందుగానే తమకు కేటాయించిన ప్రాంతాలు, విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భద్రతా చర్యలను సమన్వయంతో నిర్వహించాలని పేర్కొన్నారు.జూనియర్ కళాశాల పరిసర ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు సిబ్బంది విధులు, వాహనాల రాకపోకలు, పార్కింగ్ ప్రాంతాలు, వీఐపీల ప్రవేశ నిష్క్రమణ మార్గాలు, ప్రజల రాకపోకలు, వీఐపీ భద్రత తదితర అంశాలను డీసీపీ క్షుణ్ణంగా పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం లేకుండా అప్రమత్తంగా ఉండాలని, భద్రతా పరంగా ప్రతి అంశాన్ని ముందుగానే అంచనా వేసి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీపీ పెద్దపల్లి కృష్ణ, సుల్తానాబాద్ సీఐ రంజిత్ రావు, ఎస్సై చంద్రకుమార్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా క్రికెట్ జట్టుకు చేతన బెస్ట్ అకాడమీ క్రీడాకారుల ఎంపిక



(భద్రాచలం, ఆగస్టు 17 ): హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న సీ డివిజన్ వన్డే లీగ్స్‌కు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో భద్రాచలంలోని చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి చెందిన నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. అకాడమీకి చెందిన సాయి కిషోర్, చేతన్య సాయి, జ్ఞాన చంద్ర, ఏజీ పాషా తమ ప్రతిభను చాటుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టులో చోటు సంపాదించారు. ఒకే అకాడమీ నుంచి నలుగురు క్రీడాకారులు ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు ఎంపిక కావడం చేతన బెస్ట్ క్రికెట్ అకాడమీకి గర్వకారణమని అకాడమీ నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన క్రీడాకారులను కోచ్ శరత్ తేజ, వారి తల్లిదండ్రులు, క్రీడాభిమానులు అభినందించారు. రాబోయే మ్యాచ్‌లలో మరింత ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

## విలేఖరి పుల్ల రవితేజపై దాడి చేసిన నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు మరియు మర్డర్ కేసు పెట్టి వెంటనే అరెస్టు చేయాలి

**దళిత సంఘాల డిమాండ్**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 17: సోమవారం రోజున చిట్యాల మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆర్ బి న్యూస్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరి పుల్ల రవితేజ పై దాడి చేసిన నిందితులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని నిరసన కార్యక్రమం చేపట్టడం జరిగింది . ఈ సందర్భంగా అంబేద్కర్ ఫెలోషిప్ నేషనల్ అవార్డు గ్రహీత అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ పుల్ల మల్లయ్య ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు నేరెళ్ల ఓదెలు మాదిగ ధర్మ సమాజ్ పార్టీ జిల్లా నాయకులు పుల్ల అశోక్ లు మాట్లాడుతూ చింతకుంట రామయ్య పల్లి రైతుకు జరిగిన అన్యాయంపై ఎలక్ట్రానిక్ మీడియాలో వార్త కవర్ చేశాడని ఆర్ బి న్యూస్ విలేకరి పుల్ల రవితేజ పై ఆదివారం రాత్రి ఇంట్లో చొరబడి దాడి చేసిన నిందితులను సంబంధించిన అధికారులు గుర్తించి చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంట్లో మహిళ అని చూడకుండా కులం పేరుతో దూషిస్తూ నాన్న బూతు మాటలు తిడుతూ రవితేజను విపరీతంగా కొట్టడం సిగ్గుచేటన్నారు. ఈ సంఘటనపై సంబంధించిన అధికారులు మరియు డి.ఎస్.పి తక్షణమే సమగ్ర విచారణ జరిపించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని తెలిపారు నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు అందరూ సమానులే అని వారు అన్నారు. వివిధ పత్రికల విలేకరులు ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు వార్తలు సేకరించి కవర్ చేయడం వారి వృత్తి ధర్మం ఇది గిట్టని వాళ్లు ఇలా దాడి చేయడం సిగ్గుచేటన్నారు సంబంధించిన అధికారులు చట్టరీత్యా చర్యలు తీసుకోనట్లయితే దళిత సంఘాల ఆధ్వర్యంలో దశలవారిగా ఆందోళన కార్యక్రమాలు చేపడతానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత గురుకుంట్ల కిరణ్ మాదిగ జాగృతి సంఘం జిల్లా కన్వీనర్ పర్లపల్లి వంశీ డీఎస్పీ మండల నాయకులు నేరెళ్ల రమేష్ చిలుముల కృష్ణ బోడ్డు పాల్ చరణ్ చిలుముల చేరాలు ఏ వై ఎస్ నాయకులు పుల్ల సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## తానూర్‌లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌పై బీఆర్ఎస్ ధర్నా

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 17: నిర్మల్ జిల్లా:తానూర్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకురాలు డా పడకంటి రమాదేవి ఆధ్వర్యంలో తానూర్ గ్రామంలో ధర్నా నిర్వహించారు. పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే ఈ పథకాల ద్వారా లబ్ధి పొందాల్సిన కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని బీఆర్ఎస్ నాయకులు పడకంటి రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారులకు వెంటనే ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పథకం ప్రయోజనం అందేలా చర్యలు తీసుకోవాలని రమాదేవి కోరారు. ఇదిలా ఉండగా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెల్లింపులపై తెలంగాణ హైకోర్టు ఇటీవల మధ్యంతర స్టే విధించిన విషయం తెలిసిందే. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు చెల్లింపులు నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది.

## జిల్లాలో పని చేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం యాప్‌లో నమోదు కావాలి

**సెన్సస్ హ్యాండ్ బుక్ కొరకు తగిన సమాచారం ఇవ్వాలి**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) ఆగస్టు 17: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి ఉద్యోగి మీ ప్రమాణం ముఖ గుర్తింపు హాజరు యాప్ లో నమోదు కావాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఆయన మీ ప్రమాణం యాప్ నమోదు, జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల్లో పనిచేసే ప్రతి స్థాయి రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మీ ప్రమాణం యాప్ ద్వారానే హాజరు నమోదు చేసుకోవాలన్నారు. ఇప్పటివరకు నమోదు కాని శాఖలు వెంటనే నమోదు చేసుకోవాలని ఆదేశించారు. మీ ప్రమాణం హాజరు నమోదులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాఖాధిపతులు తప్పనిసరిగా ఎప్పటికప్పుడు సిబ్బంది హాజరు వివరాలు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అలాగే జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పన కోరకు, సంబంధిత శాఖల అధికారులు నిర్దేశిత సమాచారం అందించాలని ఆదేశించారు. శాఖల వారిగా అందించే ప్రతి సమాచారం పక్కాగా ఉండాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఇతర అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జహీరాబాద్‌లో భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి

ఝరాసంగం ఆగస్ట్ 17 (వాయిస్ టుడే): జహీరాబాద్ పట్టణంలో నాగుల పంచమి వేడుకలు సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రావణ శుక్ల పంచమిని పురస్కరించుకుని ఉదయం నుంచే ఆలయాలు, నాగదేవత విగ్రహాలు, పుట్టల వద్ద భక్తుల సందడి నెలకొంది. మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పుట్టలకు పూజలు చేసి పాలు పోశారు. నాగదేవతలకు పాలు, పాయసం, పండ్లు తదితర నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు కలగాలని, సర్పదోషాలు తొలగిపోవాలని భక్తులు ప్రార్థించారు. మహిళలు సంప్రదాయబద్ధంగా పూజలు నిర్వహించగా, చిన్నారులు కూడా వేడుకల్లో పాల్గొన్నారు. భక్తుల రాకతో ఆలయాలు, పుట్టల పరిసరాలు సందడిగా మారాయి.

## ఆస్పత్రి లో మృతి చెందిన నిండు గర్భిణి బైరు అనిత కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలి

**నిర్లక్ష్యం వహించిన సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది డ్యూటీ డాక్టర్ పై కఠిన చర్యలు తీసుకోవాలి**

**మైసగళ్ల బుచ్చేంద్రలిమాదిగ**

**MRPS, మాజీ జిల్లా అధ్యక్షులు**

సంగారెడ్డి (వాయిస్ టుడే): సంగారెడ్డి జిల్లా అందొల్ నియోజకవర్గం చౌటకూర్ మండలము బద్రి గూడెం గ్రామములో మృతి చెందిన నిండు గర్భిణి భైరి అనిత కుటుంబాన్ని ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పూర్ర సంతోష్ మాదిగ నియోజకవర్గ ఇన్చార్జ్ అధ్యక్షతన సందర్శించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మైసగళ్ల బుచ్చేంద్ర మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షులు హాజరై కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పి కుటుంబానికి న్యాయం చేయాలని మాట్లాడుతూ, నిండు గర్భిణి భైరీ అనిత మృతి పైన నిండు గర్భిణి భైరీ అనిత సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి 10.08.2026 తేదీ నాడు లో జాయిన్ కావడం జరిగింది. ఈ సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రి లో సిబ్బంది నిర్లక్ష్యం వలన 12.08.2026 నాడు మృతి చేసింది. ఈ విషయంపై సంగారెడ్డి జిల్లా మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ గారు స్పందించడం కరువైంది. అందోల నియోజకవర్గం నుండి మీరూ గా గెలిచిన మంత్రి గారు బద్రిగూడెం గ్రామానికి వచ్చి పరామర్శించడం జరగలేదు. నిండు గర్భిణి భైరీ అనిత మృతి కారణంగా కుటుంబం శోక సంద్రంలో మునిగింది. ఈ సంఘటన పై ఆస్పత్రి సిబ్బంది పై సమగ్ర విచారణ జరపాలీ అని డిమాండ్ చేశారు అంతేకాకుండా ఈ కుటుంబానికి జిల్లా కలెక్టర్ గారు స్పందించి కుటుంబ సభ్యులకు 25 లక్షలు నష్ట పరిహారము తో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మాజీ జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో, ఆందోల్ నియోజకవర్గం ఇన్చార్జి సంతోష్ కుమార్ అధ్యక్షతన మరియు వీరూూ నాయకులు మీరూ జిల్లా నాయకులు గందగల్ల వీరయ్య మాదిగ కొండాపూర్ మండల ఇంచార్జ్ కందుకూరి వినయ్, మునిపల్లె మండల కోఆర్డినేటర్ జంగం నవీన్, రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.